# కొమ్ములు

"పెద్ద పెద్ద పోతుపాలెగాల్లే నా మాటకు తల అడ్డం వూపరు. నీకేం కొమ్ములొచ్చినయా – నేనవునంటే నువ్వు కాదంటవు" గద్దించాడు రామిరెడ్డి.

నెత్తిమీది గడ్డిగంప ఎదలదాకా దించి, బలాన్నంతా చేతుల్లో కేంద్రీకరించి గంపను జారిపోకుండా పట్టుకొంటూ చూరు తగలకుండా ఇంట్లోకెళ్ళింది లక్ష్మమ్మ.

గంపను గోడవారని దించి రొండిలోని కొడవలిని పీకి గూట్లో పెట్టింది. రెండు చేతుల్తో వెంట్రుకల్ని వెనక్కి దువ్వి కొప్పుగా ముడేస్తూ బైటకు నడిచింది.

"నేను అమ్ముదామని బేరగాల్లను పిలుస్చే – నువ్వు వాల్లకు దండాల్దసుగులు పెట్టి కొనగాకమన్నేవంట... నాదొక మాటా? నీదొక మాటా?" పడిపోయిన మొండిగోడకింది రాళ్ళ మీద కూచుని రొప్పుతున్నాడు అతను.

ఆమె అటు ఇటు పారజూసింది.

కొట్టం పక్కనున్న వారపాకలోకి తొంగిచూసింది.

"బరుగొడ్డు లేదే?" అప్రయత్నంగా ఆమె పెదాలు గొణిగాయి.

"సుభద్రా!" అంటూ పిల్చింది.

"మ్మేయ్!" అంటూ గట్టిగా కేకేసింది.

"నేనంటే లెక్కలేకుండా పొయ్యింది. పది మందిలో నా పరువు దీస్చివి. నీవగలేదుపుల్జూసి ఆ నా కొడుకులు బరుగొడ్డును కొనకుండా పొయ్యిరి. కొజ్జా నా కొడుకులు..." అంటున్నాడు అతను

అక్కణ్ణించి చరచర వీధిలోకి నడిచింది.

"మ్మేయ్ సుభద్రా!" అంటూ కేకేసింది.

"అక్కా! మా పిల్లేమైనా కనపన్నెదా?" అడిగింది.

ఆమె చెప్పిన ఆనవాలు ప్రకారం చెరువుదారి బట్టింది. కళ్ళాలు దాటగానే సన్నని ఏడుపు.

ఆ ఏడుపును సముదాయిస్తూ మరో ఏడుపు.

గొంతును పోల్చుకోంది.

సరసర నడిచింది. సుడిగాలిలా కదిలి పాపను చేరింది.

ఆదరాబాదరా ఆమె చేతిలోని పసిగుడ్డను ఆప్యాయంగా తనచేతుల్లోకి తీసుకొంది.

ఏడ్చి ఏడ్చి ఎక్కిళ్ళు పట్టి ఉన్నాయి.

"అబ్బి ఏడుస్నాంటే - నీ కోసం వస్నాండమా!" పాప చెప్పింది.

ఆ పిల్లాన్ని మోయలేక ఇంతదూరం ఎగేసుకొంటూ చంకన ఇరికించుకొచ్చిన కూతురి అవస్థకు గుండె కరిగింది.

ఏడుపుతోనే ఎదలు తడువుతున్నాడు పిల్లాడు.

కంప కట్టవ పక్కనే రాతిమీద కూచుని రవిక గుండీ విప్పింది.

ఆకాశం నిండా కారుమొయిళ్ళు కదం తొక్కుతున్నాయి.

పొద్దగింకిందీ లేనిదీ సరిగ్గా అర్థం కావటంలేదు.

అందుకే తను అడ్డదారిన వచ్చి పిల్లలకు ఎదురుపడలేదు.

"అమోవ్! మన బరుగొడ్డే... జంగిట్లోంచి తప్పించుకొన్నెదంట. జంగిడిగానే యోబు చెప్పిందు" కంప కట్టవలోని కలివెచెట్టు కొమ్మల్లో కాయల కోసం వెదుకుతూ చెప్పింది పాప.

పిల్లాడి ఏడుపు మోహంలో బర్రె ఆచూకి అడిగేందుకు మరచింది తను. ఈన మోసిన బర్రె. రేపో...మాపో... అంతే.

పొద్దున జంగిడిలో తోలడమే పొరబాటు.

ఇంటికాడుంటే బలవంతంగా అయినా బేరగాళ్ళకు పట్టిస్తాడేమోనని భయపడింది తను.

ఇప్పుడసలు ఇంటికే రాలేదు అది.

ఎక్కడున్నా ఈనుకొందో ఏమో!

దూడను వదలి రాలేక అక్కడే నిద్రపొలం జేస్తోందేమో!

బర్రెను కనిపెట్టుకొని తోలుకు రానందుకు ఏబుగాని మీద కోపమొచ్చింది.

పిల్లవాణ్ణి మరోచన్నుకు మార్చుకొంది.

కొద్దిసేపు పాలు తాగనిచ్చి పక్కకు తొలగించి రవిక గుండీ పెట్టుకుంది.

ఇంకా ఎగబాకుతోన్న పాపణ్ణి నవ్వుతో సముదాయించింది. గడ్డి గంపతో ఇంటికి పోతూవున్న ఆడమనిషిని ఆపింది. "అత్తా! ఈన్ని తీసప్పో. బరుగొడ్డు ఇంటికి రాలే... ఎదురెక్కి పొయ్యొస్నా!" అంటూ కుర్రాణ్ని ఆమె చంకకు కరిపించింది.

పాపను ఆమె వెంట పంపింది.

ఎదురైన వాళ్ళను బర్రె ఆచూకి గురించి అడుగుతూ చెరువుదాకా వెళ్ళింది. కట్ట ఎక్కి చెరువు లోతట్టుకేసి నిశితంగా పొరజూసింది.

ఎక్కడా గొడ్డు జాడలేదు.

బరకదాకా వెళ్ళొద్దామని ఉందిగాని చీకటి చిక్కనవుతూ ఉంది.

ఇప్పుడో...ఇంకాసేపట్లోనో వానొచ్చేట్టుంది.

వెనుదిరిగింది ఆమె.

మనస్సు కుదుటబడలేదు.

ఈనుకొని ఉంటుందనే నమ్మకం.

ఇంటిమగాడు సంసారాన్ని పట్టించుకొనే వాడయితే జంగిడి రాగానే ఎదురెక్కి వెళ్ళి బరకల్లోని వంకలన్నీ వెదకి ఉండేవాడు. చంటిదూడను మెడలమీదేసుకొని తను ముందు నడుస్తూ ఉంటే అతని కాళ్ళు తొక్కుకొంటూ వెనకే వచ్చి ఉండేది బర్రె.

ఆందోళనతోనే ఇంటికొచ్చింది ఆమె.
మొండిగోడల మీద మొగుడు లేడు.
బర్రెను గురించి ఆలోచిస్తూనే బియ్యం కడిగి పొయ్యిమీద పెట్టింది.

*　　*　　*　　*

బైట వర్షం మొదలైంది.

ఇన్ని కార్తెలు బిగదీసి పుబ్బకార్తెలో విరగదొక్కుకుంటూ వస్తోంది వాన. అంత సులభంగా వదిలేట్టులేదు.

వాన వదుపందుకొనేసరికి వంట పూర్తయింది.

అంతకు ముందే ఇంట్లోకి వచ్చివున్నాడు రామిరెడ్డి.

కాళ్ళకట్టకు రెండు కాళ్ళు నిగుడదన్ని, తలకింద రెండు చేతులు పెట్టుకుని కుక్కిమంచంలో వెల్లకిలా పడుకొని ఉన్నాడు.

పళ్ళెంలో అన్నం వడ్డించి పాపచేతికిచ్చింది లక్షుమ్మ.

"నాయనో! బువ్వదిను" పాప చెప్పింది.

"పీటకాడ కాలబెట్టు" కసరుకున్నట్లుగా చెప్పి లేచాడు.

చేతులు కడుక్కొని అన్నం ముందు కూచున్నాడు.

ఏదేదో గొణుక్కొంటూ భోజనం ముగించాడు.

అన్నాన్ని మెత్తగా పిసికి పిల్లాడికి తినిపిస్తూ ఉంధి ఆమె.

మళ్ళీ మంచంమీద పడుకున్నాడు అతను.

తనూ అన్నం తిని తండ్రిపక్కన వొదుక్కొంది పాప.

"నాయినా! మన బరుగొడ్డు ఇంటికి రాలే..." చెప్పింది.

"రాకుంటే...సావనీ..." కసిగా చెప్పాడు.

తండ్రి గొంతులోని వేడిమిని గ్రహించింది కాబోలు, పాప మరేమీ మాట్లాడలేదు. బైట వాన ఒక్కోసారి వడపుగా మోదుతోంది.

పిల్లాడిని పక్కనేసుకొని మరో మంచమ్మీద వొరిగింది లక్షుమ్మ.

బర్రెను గురించి అలజడి ఆమె గుండెల్లో అంతకంతకూ ఎక్కువవుతోంది.

కన్నబిడ్డలా సాక్కొంది దాన్ని.

తనెన్ని అవస్థలన్నా పడనీ – మాపటి పొద్దుకి గంపెడు పచ్చిగడ్డి గాటవేయకుండా దాన్నెప్పుడూ పడుకోబెట్టలేదు.

అది ఈనితే ఎంత లేదన్నా రెండు లీటర్ల పాలు అమ్మొచ్చు. రోజూ పదైదు రూపాయల లెక్కొస్తది. సంసార బాధలు కొన్నయినా తీరుతాయి.

పిల్లలు నిద్రబోయినట్టున్నారు.

మంచమ్మీద మొగుడేదో సన్నగా గొణుక్కుంటున్నాడు.

ఉన్నట్టుండి అతనిగొంతు పెరిగింది.

"ఎంత పుట్టింటోల్లిచ్చిన గొడ్డయితే మాత్రం – అది నీ సొంత ఆస్తెయిద్దా? నిన్ను కట్టుకొన్న మొగునికి బాగముండదూ! మా నాయన నాకిచ్చిన ఆస్తెంతా నా సొంతమనుకోలేదే నేను. తెగనమ్మి ఇన్నేండ్లూ నిన్ను కూకోబెట్టి సాకిన్నే. నా ఆస్తెంతా అయిపోబట్టిగాదూ నీకింత సులకనయ్యింది."

మౌనంగా ఉండిపోయింది ఆమె.

రొమ్ము చీకుతూవున్న పిల్లాడి పెదాలు నెమ్మదిగా నిశ్చలమయ్యాయి.

పాపకూడా నిద్రబోయినట్టుంది.

అతని గొంతు మాత్రం మూగబోలేదు.

కడుపులోని ఆవేదనంతా వెళ్లగక్కుతున్నాడు.

"గొడ్డను బేరంబెట్టింది నేనేం ఆకులాడదానికో, మందుకొట్టదానికో, చెడుతిరుగుళ్ళకో అయితే వొద్దనాల. శిక్షనుంచి తప్పించుకొనేందుకని సెప్పిన్నే. సాక్షాన్ని కొనుక్కోవాల. వాన్ని మనపక్క తిప్పుకోవాలి. ఈ పన్జెయ్యకుంటే నాకు లైఫ్ జెప్పుతరు. బతికినన్నాళ్ళూ జైల్లో ఉండాల. ఇంత పానమ్మీదకి వొచ్చిన పనిగాబట్టే బరుగొడ్డను అమ్ముతాండనని సెప్పినా నీకు అర్ధం గాలేదే!"

ఆమె సమాధానమేమీ ఇవ్వలేదు.

తను కూడా బర్రెను గురించే దిగులుజెందుతోంది.

"అసలు నువ్వేమనుకొంటాండవు?" అంటూ దిగ్గున మంచమ్మీద లేచి కూచున్నాడు.

"నేను జైల్లో బన్నే నీకిబ్బంది లేదు. మొగుడు లేకున్నా పర్వాలేదు. అంతేగదూ!" అన్నాడు తీవ్రంగా.

ఆమె మౌనం అతని ఆవేశాన్ని విపరీతంగా పెంచింది.

మంచం దిగి ఆమె మంచం వద్దకు వెళ్ళాడు.

"పలకవేమే!" అంటూ గద్దించాడు.

"నన్ను జైల్లో బెట్టించి నువ్వింటికాడ కులుకుదామనుకొన్నెవా?" అంటూ జుట్టుపట్టుకొని ఆమె తలను మంచం పట్టెకేసి రెండుసార్లు మోదాడు.

కిక్కురుమని కూడా అనలేదామె.

"నువ్వు మనిషివిగాదే. దయ్యానివి" అన్నాడు.

"నేను జైల్లో ఉంటే నువ్వీడ ఎట్ట సంసారం జేస్చామనుకొన్నవే!" అంటూ జీరవోయిన గొంతుకతో మంచం వద్దే కూలబడ్డాడు. "జెయిలయినా, బయలయినా ఇద్దరం ఒక్కసోటే ఉందామనుకుంటిమి గదే. దేవుడు నీకీ పాడు బుద్ధి ఎట్ట బుట్టిచ్చిండే..." అంటూ వలవల ఏడవసాగాడు.

ఉలిక్కిపడి లేచిన పిల్లాణ్ణి ఎదలకేసి అదుముకొంది ఆమె. చేతికి చల్లగా తగిలేసరికి పరిశీలనగా చూసింది.

పైన్నించి టపటప రాలుతున్నాయి చినుకులు.

తెల్లారేసరికి కొట్టమంతా కారుతుంది. కూచోనుకూడా తావుండదు. ఎనుగాడిమీద బోదంతా కుళ్ళిపోయి ఉంది.

దీర్ఘంగా నిట్టూర్చింది ఆమె.

పిల్లాడు తడవకుండా పైట చెరగు కప్పింది.

* * * *

జాము పొద్దున్నించే తెరిపిచ్చినట్టుంది వాన.

కారే కొట్టంతో లక్షుమ్మకు నిద్రలేదు. తెల్లార్లూ మంచమ్మీద గొంతుక్కూచుని పిల్లల్ని సంరక్షించుకొంటూ వుంది.

తెల్లారక ముందే లేచి బైటపడింది.
దారులన్నీ రొంపిరొంపిగా ఉన్నాయి.
చెరువుదాకా వెళ్ళేసరికి బాగా తెల్లారింది.
రాత్రి వానకు చెరువులోకి నీళ్ళు కూడా చేరాయి.
వాగులు ఇంకా సన్నగా సాగుతున్నాయి.
చెరువు దాటింది.
బరకలో అడుగుపెట్టింది మొదలు గొంతెత్తి బర్రెను పిలుస్తూ వెదకసాగింది.

పెద్ద మిట్ట రాళ్ళ వరస దగ్గరికెళ్ళే సరికి ఆమె పిలుపుకు బర్రె గొంతు ప్రతిగా పలికింది.

ఆదరాబాదరా రాళ్ళ మీదుగా అటుకేసి నడిచింది.
ఎదురుగా బర్రె. తప్పటడుగులు వేస్తూ దూడ.

యజమానురాలిని చూడగానే మోరపైకెత్తి పలుకరిస్తూ దూడను నాకసాగింది బర్రె.

నాలుగంగల్లో దూడ దగ్గరకెళ్ళింది.
పెయ్యదూడ.
ఆనందం కలిగింది.
రాత్రంతా వానలో తడిసినట్టుంది.
నేలమీద బర్రె తొక్కులాడిన గుర్తులు దండిగా ఉన్నాయి.
పరిశీలించి చూసి ఉలిక్కిపడింది.

దూడను కేంద్రంగా చుట్టూ పదగజాల మేర బురదబురదగా తయారై ఉంది. బర్రె గిట్టల తాకిడికి మిట్టమీద సైతం బురదమయమైంది. అదేపనిగా బర్రె పరుగెత్తిన జాడలు, దూడ వద్దనించి పది గజాల దూరం దాకా పరుగెత్తటం, తిరిగి రావటం. వందల సార్లు అట్లా పరుగెత్తినట్లుంది. తెల్లార్లూ తిరిగినట్లే వుంది. ఒక్కోచోట కొమ్ములతో చెలగినట్లు కూడా ఆనవాలు.

ఏదో జంతువును దూడవద్దకు రానీకుండా తెల్లార్లూ ఆ జంతువుతో యుద్ధంచేసి దూడను రక్షించుకొంది. కొమ్ముల బలంతో క్రూరజంతువును తరిమికొట్టింది.

బర్రెకేసి ఆశ్చర్యంగా చూసింది ఆమె.
ప్రాణాలకు తెగించి దూడను రక్షించుకొన్న బర్రెను గౌరవంగా చూసింది.

దగ్గరకెళ్ళి ఆప్యాయంగా దానికొమ్ముల్ని తడివింది. మోరను నిమిరింది. వీపును అరచేతితో స్పర్శించింది. దాని మోము మీద ఆనంద బాష్పాలు రాల్చింది.

దూడ గిట్టలు గిల్లి రెండు చేతుల్తో ఎదలదాకా ఎత్తుకొంది.
అట్లా చేతుల మీదనే మోసుకెళ్ళ సాగింది.
బర్రె ఆమె వెనకే పరుగెత్తింది.

ఆమెను రుద్దుకొంటూ ముందుకు తిరుక్కుని దూడను నాకుతూ నడకకు అడ్డు రాసాగింది.

తనకు అత్యంత విశ్వాసపాత్రమైన ఆమె స్పర్శను కూడా నమ్మలేకపోతోంది బర్రె. అదలిస్తోన్నా అడ్డగించుకొంటోంది. తెల్లార్లూ అనుభవించిన వేదన ఛాయలు దాన్నింకా వీడినట్టు లేదు.

దూడను దించింది లక్షుమ్మ .

బర్రెను మరోసారి వొళ్ళంతా తడివింది. దూడను దాని పొదుగు కిందకు తీసికెళ్ళి చన్ను నోట కరిపించింది.

బాగా నమ్మకం కుదిరిన తర్వాత దూడను మెడలమీదకు ఎత్తుకొని కదిలింది.

బర్రె ఆమెను అనుసరించసాగింది.

బర్రె యుద్ధం చేసిన తీరు ఆమెకు ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంది. అది తన దూడను కాపాడుకొన్న తీరు స్ఫూర్తిదాయకంగా ఉంది.

బలమైన కొమ్ములతో శత్రువును భయపెట్టింది.

అవును... తన కొమ్ములతోనే.. తనకున్న ఏకైక ఆయుధమైన కొమ్ములతోనే....

అప్పుడప్పుడూ తన మగడు అంటూ ఉంటాడు "నీకేం కొమ్ము లొచ్చినయా?" అని.

మొగున్ని ఎదిరించాలంటే ఆడాళ్ళకు కూడా కొమ్ములు రావాలన్నమాట.

* * * *

బర్రెను గాట కట్టేసింది.

నీళ్ళు సలసల కాచి, వొళ్ళంతా కడిగింది.

మక్కులమీద ఆముదం రాసింది.

దూడను చూసి పాప అంతులేని ఆనందంతో పరవశురాలవుతోంది.

"పెయ్యదూడను ఈనింది. మొన్నటి బేరంకన్నా ఐదొందలు జాస్చే అమ్ముద్ది" అప్పుడే వీధిలోంచి అక్కడకొచ్చి దూడను చూస్తూ అన్నాడు రామిరెడ్డి.

ఆమె నోరెత్తకుండా తనపని తాను చేసికొంటూ వుంది.

"నిన్నటాల మొండికెయ్యగాకు, బూమీ పుట్రా ఉన్నెప్పుడు నిన్నడిగిన్నా? పొలాలమ్మి నిన్ను కూకోబెట్టి సాకలే"

అతనికేసి తీక్షణంగా చూసింది ఆమె.

"నువ్వు అడ్డగించుకొన్నే అమ్మకుండా సాలిచ్చేదిలే.. సంతకయినా తోలకపొయ్యి అమ్ముతా" చెప్పాడు.

చేతిలోని గడ్డి పరకల్ని విసరికొట్టింది ఆమె.

బర్రెముందున్న బక్కెటను ఎత్తి శబ్దమొచ్చేలా జార విడిచింది.

అరుగుమీద పాత సెరవను కిందపడేలా చేత్తో నెట్టింది.

దూడ దగ్గరకు రాబోతూ ఉన్న కుక్కను తుంటకట్టెతో శక్తి కొద్దీ బాదింది. అది కుయ్యోమంటూ వీధి చివరిదాకా అరుచుకొంటూనే వెళ్లింది.

"నన్ను కూకోబెట్టి సాకదానికే పొలాలమ్మిండంట" గొణుక్కొంటూ ఇంట్లో కెళ్ళింది "నన్ను సాకదానికే పెద్దరెడ్డి పక్కజేరి పార్టీలో తలదూర్చిండేమో! సేద్దెం సాలిచ్చి మీసాల్దిప్పుకుంటా తిరిగిందీ నన్ను సాకదానికేనేమో! కట్టెబట్టిందీ, బాంబుల్జుట్టిందీ, బాకులు నూరిందీ, పోలీస్టేషన్ల జూసిందీ, కోర్టులకు పొయ్యొచ్చిందీ నన్ను కూకోబెట్టి సాకదానికేనేమో!" లోపల్నించి ఆమె ఏడుపుగొంతు బిగ్గరగా విన్పిస్తూ ఉంది.

ఆశ్చర్యపోతూ వాకిలికేసి చూశాడు అతను.

ఎవరైనా వింటున్నారేమోనని వీధిలో అటు ఇటు పరికించాడు.

"చిన్న చిన్న కయ్యలమ్మిండు. ఎకరాలకు ఎకరాలు అమ్మిండు. పుట్టింటోల్లు బెట్టిన నా మెడలో బంగారుగూడా ఈని బొక్కన కొట్టుకొన్నెడు... ఈని పార్టీలకు ధూమొచ్చిపోనూ.. ఈని మీసాలకు పేనుకొరుకుడు రానూ. ఇప్పుడు పిల్లోల్ల నోటికాడి చారెడు పాలు గూడా మట్టిగలపాలని సూస్తాండు - ఈని పౌర్సాలకు అగ్గిబడ. బరుగొడ్డును అమ్మి సాక్షాలను కొనకుంటే అవతలోల్ల కాల్లుబట్టుకుంటే రాజీపడరూ! వాల్లేం పరాయోల్లా?"

ఉలిక్కి పడ్డాడు అతను.

చరచరా వాకిలి దాకా నడిచాడు.

ఎప్పుడూ లేనిది ఇవాళ ఆమె గొంతువిప్పటం అతనికి మింగుడు పడకుండా ఉంది.

"నోరు మూస్తావా లేదా? నా ఇంట్లో ఉండి నా మీందికే తిరగబడ్తావంటనే..." అరిచాడు.

"ఇండ్లు....ఇదొక ఇండ్లూ... దీంట్లో సంసారమూ... నువ్వే వుండు. దీన్ని గూడా అమ్ముకొని ఇంగొక కేసుకు దిరుగు. నా పిల్లోల్లూ నేనూ యాడన్నా సెట్టుకింద బతుకుతంలే..." అంటూ బైటకు నడిచింది.

నేరుగా బర్రె వద్దకెళ్ళింది.

దాని కొమ్ముల్ని ఆప్యాయంగా తడివింది. తనకు లభించిన అండగా అనుభూతిస్తూ స్పృశించింది.

తన మగడు అతనికున్న స్వల్పమైన ఆర్థిక స్థితి గుడిసెనే కొమ్ములుగా చేసికొని తన్ను పొడవబోయాడు.

తన కొమ్ములేవో ఇప్పుడు బాగా తెల్సి వస్తూ వుంది.

తనక్కూడా కొమ్ములుండటం ధైర్యాన్ని కలిగిస్తూ వుంది.

ఆలోచిస్తూనే బర్రె తలుగు విప్పింది లక్షుమ్మ.

◆ *'పెన్నేరు' మాసపత్రిక - 01.10.2002.* ◆